ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 24 అక్టోబరు 2024



గల్ఫ్ మృతులకు ఎక్స్‌గ్రేషియా విడుదల

జగిత్యాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7, 2023 నుంచి ఇప్పటివరకు గల్ఫ్‌లో మృతి చెందిన 160 మంది తెలంగాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల 45 లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదల చేసిందని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్, ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ మంద భీంరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ మృతుల సంఖ్య ఆధారంగా ఆయా జిల్లాలకు కేటాయింపులు చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

విద్య, వైద్య హబ్‌గా జగిత్యాల
- డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
8లో.. - జగిత్యాల అగ్రికల్చర్

భూ సర్వేపనులు త్వరగా పూర్తి చేయాలి
- ఎల్ఆర్ఎస్ పనులు వేగవంతం చేయాలి
- కలెక్టర్ సత్యప్రసాద్
8లో.. - జగిత్యాల రూరల్/కోరుట్ల

జాబితాపూర్ హత్య కేసుపై పోలీసుల విచారణ
- నిందితుడి సెల్‌ఫోన్ కాల్ డాటా సేకరణ
- కొనసాగుతున్న పోలీసుల పికెటింగ్
8లో.. - జగిత్యాల క్రైం

ఆస్తి తగాదాలతో అన్నను చంపిన తమ్ముళ్లు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు
6లో.. - మెట్‌పల్లి టౌన్



- ముందే మిల్లర్ల మెలిక
- సన్నరకం మిల్లింగ్‌కు ససేమిరా
- సీఎంఆర్ ఔట్‌టర్న్‌పై స్పష్టత కరువు
- రైస్ మిల్లర్లతో సివిల్ సప్లయ్ శాఖ సంప్రదింపులు
- కొనుగోళ్లకు రంగం సిద్ధం చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

సన్నాల కొనుగోళ్లు ప్రశ్నార్థకం

జగిత్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం సేకరణపై రైతులకు నిరీక్షణ తప్పేటట్టు లేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు మొదలువగా ఇతర మరికొంత సమయం పట్టనుంది. వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ, రెవెన్యూ, తూనికలు, కొలతలు, ఐకేపీ, మెప్మా తదితర శాఖలు సన్నద్ధం కాగా..రైతులు సైతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు.

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు ఈ వానాకాలం సీజన్‌లో కొందరు రైతులు సన్న రకం వరి పంటను సాగు చేశారు. ఎప్పటిలాగే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైస్‌మిల్లులకు తరలించేందుకు పౌరసరఫరాల సంస్థ సన్నాహాలు చేస్తుండగా సీఎం ఆర్ శాతం 67 నుంచి 58కి తగ్గిస్తేనే ధాన్యం దించుకుంటామని రైస్‌మిల్లర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ముందే అవాంతరాలు ఏర్పడుతున్నాయి.

421 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 421 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఇందులో 133 కేంద్రాలు ఇందిరాక్రాంతి పథం మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనుండగా, 277 కేంద్రాలు సహకార శాఖ ద్వారా, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గానూ 1.43 లక్షల గన్నీ బ్యాగులు అవసరము ఉండగా, ప్రస్తుతం జిల్లాలో 23 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. మరో 1.20 లక్షల గన్నీ బ్యాగులను కొనుగోలు చేయడానికి పౌరసరఫరా శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మిల్లర్ల మెలికతో సంశయాలు

జిల్లాలో ఈ వానాకాలంలో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు దిగుబడిని అంచనా వేసి నిర్ణీత ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు జిల్లాల్లో దశల వారీగా...కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు ఏర్పాటు జరుగుతున్న తరుణంలో క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని

మిగతా 8వ పేజీలో...

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



నివాళులు అర్పిస్తున్న భారత్ సురక్ష సమితి నాయకులు

జగిత్యాల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు బుధవారం కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ అమరవీరుడు ప్రకాష్ విగ్రహానికి భారత్ సురక్ష సమితి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల త్యాగాల ఫలితంగానే మనమంతా ప్రశాంతంగా నిద్రపోతున్నామని వారి ఆకాంక్షలను నేరవేర్చే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కాశీనాథం, గంగాధర్, దేవరాజం, పోచమల్లు, మల్లిఖార్జున్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలపై సమావేశం



సమావేశమైన గౌడ సంఘం సభ్యులు

రాయికల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయోధ్య గ్రామంలో రాయికల్ మండల తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను గీత కార్మికులను పంపిణీ చేయాలని, సంఘ సభ్యులకు గుర్తింపు కార్డుల జారీ, సంఘం పరిధిలోని రెవెన్యూ భూములను సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయాలని, ప్రతి సంఘం గీత కార్మికులకు రూ.5 వేల పింఛన్ జారీ చేయాలని తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు ఉత్కం సాయ గౌడ్, లింగం, నాగుల మల్లయ్య గౌడ్, బందారి సురేష్ గౌడ్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, కొత్తకొండ లింగం గౌడ్, సభ్యులు వెంకటేష్, శ్రీనివాస్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తమ గ్రామం మీదుగా బస్సు నడపాలని నిరసన



నిరసన తెలుపుతున్న కోమన్‌పెల్లి గ్రామస్థులు

బీర్‌పూర్, అక్టోబరు 23: బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పెల్లి గ్రామం మీదుగా బస్సు నడపాలని బుధవారం కోమన్‌పెల్లి గ్రామస్థులు ఆరేపల్లి వెల్లే ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. కరోనాకు ముందుగా ధర్మపురి నుండి వచ్చే బస్సు కోమన్‌పెల్లి, డొంకేశ్వరం మీదుగా ఆరేపల్లి వెల్లేదని కరోనా సమయంలో ఆ బస్సును డొంకేశ్వరం, కోమన్‌పెల్లికి రాకుండా దొంతాపూర్ మీదుగా ఆరేపల్లి నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ విధంగా తమ గ్రామాల మీదుగా బస్సు నడిచిందో అదే విధంగా నడపాలని రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. కోమన్‌పెల్లి, డొంకేశ్వరం గ్రామస్థులు ఉన్నారు.

వసతి గృహాల మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్ష

జగిత్యాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లు, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలు, ఇతర రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులపై జిల్లా హాస్టల్ వెల్ఫేర్, ఆర్‌సీవో అధికారులతో కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కావా ల్సిన మౌలిక వసతులు అయిన వేడినీరు అందించడానికి గీజర్ లేదా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న హాస్టళ్లకు సోలార్ వాటర్ ప్లాంట్లను ఏర్పా టు చేయడానికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు సాయిబాబా, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు స్నేహభావంతో బోధించాలి

కోరుట్ల: విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహభావంతో ఉండి బోధించి వారిని ఉత్తమంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కోరుట్ల ఇంచార్జి ఆర్డీఓ నక్క శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజు అందించే మెనూలో వివరాల బోర్డును తనిఖీ చేసి వాటి వివరా లను ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి వంటలను పరిశీలించారు. విద్యాబోధన, భోజనం అందిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజు కుమార్‌లతో పాటు పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో వసతిగృహంను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

జగిత్యాలరూరల్, అక్టోబరు 23:జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీకళాశాల లో 2024-25 సంవత్సరానికిగాను డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గునుక శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల యందు బీఎస్సీలో ఎంపీసీ, ఎమ్మెస్టీసీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీసీఏఎస్‌క్యూసీ, బీకాం సీఏ, గ్రూపులనందు ప్రతి గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల మహిళ విద్యార్థినిలు ఈనెల 25 నుండి 27 తేదీల్లో ఒరిజనల్ సర్టిఫికెట్స్ తో గొల్లపల్లి రోడ్డులో గల ఏ.బి కన్వెన్షన్‌హాల్ ప్రక్కనగల కళాశాల యందు సంప్రదించాలని కోరారు. తల్లితండ్రుల వార్షిక ఆదాయం లక్షయాభైవేలు, అర్బన్ ఏరియావారికి రెండు లక్షలు మించరాదన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత నంబర్ 8639365500, 90003644889 లలో సంప్రదించాలని తెలిపారు.

అడవి మాంసం విక్రయించిన వ్యక్తిపై కేసు

రాయికల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అలెపు గంగనర్సయ్య గ్రామ శివారులో అడవి మాంసం విక్రయిస్తుండగా అటవీ శాఖ సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గంగనర్సయ్యను బుధవారం సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్ రత్నాకర్, వసీంలు జగిత్యాల జిల్లా కోర్టులో హాజరు పరిచారు.

బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్యేకు వినతి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ట్రెజరీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న చెక్కులు 6 కోట్లకు పైగా ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం మెట్‌పల్లి మున్సిపల్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బకాయిలు వెంటనేవిడుదలయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ సంఘం అధ్యక్షులు బూరం లక్ష్మణ్, ఉజగిరి శ్రీనివాస్, గంగారెడ్డి, మహేందర్, లింబాద్రి, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్‌లు

ఐకేపీ కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

జగిత్యాలరూరల్, అక్టోబరు 23 :జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో బుధవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భగా శిక్షకుడు రాంరాజ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రైతు నుంచి ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్‌జిరాక్స్ ప్రతులను తీసుకొని రిజిష్టర్‌లో నమోదు చేయాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. ప్రతి వానాకాలంలో సీజన్‌లో ప్రతి కేంద్రంకు సంబంధించి సివిల్ సప్లైసైట్‌లో 16 రకాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ అర్బన్ మండలంలో 5 కేంద్రాలు, రూరల్ మండలంలో 17 ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రవీందర్, విద్యాసాగర్, మరియా, గంగారాం, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్, వీఓఏలు పాల్గొన్నారు.

'రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే హత్యచేశారు'

జగిత్యాలరూరల్, అక్టోబరు 23 :రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేకనే తన తండ్రి గంగారెడ్డిని దారుణంగా హత్యచేశారని గంగారెడ్డి కూతురు శరణ్య బోరున విలపించారు. బుధవారం జాబితాపూర్ గ్రామంలోని తన ఇంటి వద్ద ఆమె విలేకర్లతో తమ గోడును వెల్లబోసుకున్నారు. తన తండ్రిని పథకం ప్రకారమే హత్యచేశారన్నారు. హత్య వెనుక ఎంతటివారున్నా వదలొద్దని , హంతకులను కఠినంగా శిక్షిస్తేనే తన తండ్రి ఆత్మశాంతిస్తుందని అన్నారు. తన తండ్రికి ఉన్న తెలివితేటలతో జాబితాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. జాబితాపూర్ గ్రామంలో కొందరు వ్యక్తుల చెడు కార్యకలాపాలు, ఆటలు సాగకపోవడంతోనే తన తండ్రిపై కక్షకట్టి హత్యచేశారని ఆరోపించారు. తన తండ్రి హత్య వెనుక కుట్రకోణం దాగిఉందన్నారు. హత్యకేసును లోతుగా విచారించి హత్యలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే జగిత్యాల అభివృద్ధికి నోచుకోలేదు

జగిత్యాల అర్బన్/అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే జగి త్యాల అభివృద్ధికి నోచుకోలేదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో మున్సిపల్‌కు చెందిన 9 నూతన స్వచ్ఛ ఆటోలను మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో సరైన మాస్టర్ ప్లాన్ లేకుండా పోయిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని, జగిత్యాల శరవేగంతో అభివృద్ధి చెందుతూ ఉండటం వల్ల మున్సిపల్‌పై భారం పెరిగిందన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే అధికా రులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని, ప్రజలు సరైన పద్ధతిలో చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, డీఈ యాదగిరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సి లర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చెత్త వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 23: జగిత్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో తక్షణమే పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరుతూ జిల్లా పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు ఆనందరావు, అమర్నాథ్‌రెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల నియామకం, వారికి ఇచ్చే వేతనాలు ప్రభుత్వ ఉత్తర్వులు జీవోఎంఎస్ నెంబర్ 21లో పొందుపర్చినవి అమలు చేయాలని కోరారు.

పంట కోతకు వచ్చిన తర్వాతనే హార్వెస్టింగ్ చేయాలి

జగిత్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాల సీజన్‌కు చెందిన వరి పంట కోతకు వచ్చిన తర్వాతనే హార్వెస్టింగ్ చేయాలని జిల్లా అద నపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో హార్వెస్టర్ యజమానులు, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయి శాఖ అధికారులు, ఉద్యోగులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోతకు వచ్చిన పిదప పంట హార్వెస్టింగ్ చేయడం వల్ల బియ్యం దిగుమతి నిర్ణీత లక్ష్యం మేరకు వస్తుందన్నారు. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయి కార్పొరేషన్ డీఎం జితేందర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి రాంచందర్, డీసీఓ మనోజ్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గంగారెడ్డి హత్యతో రాజకీయ లబ్ధిపొందాలనుకోవడం బాధాకరం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గంగారెడ్డి హత్య ఇతర కారాణాల వల్ల జరిగినప్పటికీ, కొందరు రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తుండడం బాధాకరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓ కార్యక్రమంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త గంగారెడ్డి హత్య బాధాకరమన్నారు. మాది రాజకీయ కుటుంబం, కాంగ్రెస్ కుటుంబం అని అన్నారు. ఆ తదుపరి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. కొందరు ఆరోపించినట్లుగా హత్యా రాజకీయంతో తనకు సంబంధం లేదన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్, అక్టోబరు 23: పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి నరేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో 250 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామంలో కల్లెడ ఇన్‌చార్జి అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హిమజ ఆధ్వర్యంలో 134 తెల్లజాతి ఆవులకు, 236 గేదెలకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలను వేశారు.



అంతర్గాంలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

న్యాక్‌లో ఉచిత శిక్షణకు అవకాశం

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 23: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, డీడీయూ-జీకేవై వారి సంయుక్త ఆధ్వర్యంలో 18 నుంచి 35 ఏళ్ల నిండిన నిరుద్యోగ యువతకు నిర్మాణరంగంలోని కోర్సులు ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్ మూడు నెలల ఉచిత శిక్షణ అందించనున్నట్లు న్యాక్ సహాయ సంచాలకులు రమేష్ తెలిపారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించబడుతుందని తెలిపారు.ఈ శిక్షణకు అభ్యర్థులు వారి ఎస్సెస్సీ మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌తో పాటు ఆరు పాసుపోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు.

క్రైం కార్నర్

ఆస్తి తగదాలతో అన్నను చంపిన తమ్ముళ్లు

- ముగ్గురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న ఆస్తి తగదాలను మనసులో పెట్టుకుని సొంత అన్న అని చూడకుండా హత్య చేశారు ఇద్దరు తమ్ముళ్లు. మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఈ నెల 20న పల్లపు సాయిలు(36)ను హత్య చేసిన ముగ్గురు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డిఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని తమ్ముళ్లు పల్లపు చందు, పల్లపు చిన్నితో పాటు గొల్ల సోయమ్మ అనే వారితో పల్లపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ వివాదంతో పాటు ఇంటి స్థలం విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో వ్యవహా రం ఎటు తెగకపోవడంతో కక్ష పెట్టుకున్న తమ్ముళ్లు మృతుడు పల్లపు సాయిలును ఎలాగైనా హత్య చేయాలని పథకం వేసారు. దీంతో పల్లపు సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి గొల్ల సోమయ్య, చందు, చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. ఆనంతరం గొడవపడి సాయిలును నెట్టివేయగా కిందపడిపోయాడు. వారి వెంట తెచ్చుకున్న తల్వార్‌తో మెడపై బలంగా నరికి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆనంతరం ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వారును స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, కిరణ్‌కుమార్, రాజులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుని ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన వెయిటర్ బనమాలి మాతాన్(54) లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ముకరంపుర ప్రాంతానికి చెందిన ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న మాతాన్ తాను నివాసం ఉంటున్న భవనంలో మొదటి అంతస్తు నుంచి పెంట్‌హౌస్‌కు వెళ్లే క్రమంలో లిఫ్ట్ హఠాత్తుగా కిందికి వెళ్ళడంతో అందులో ఇరుక్కున్నాడు. తీవ్రంగా గాయపడిన మాతాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లిఫ్ట్ సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు మృతుడి బందువులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డుపై వేసిన బోరు సీజ్

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలివీధికి చెందిన మహేందర్ అనే వ్యక్తి నడిరోడ్డుపై వేసిన బోరు వేయడంతో, సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్లపైన బోర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డుపై బోరు వేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిపిఓ శ్రీధర్, ఏఈ నరేష్, టిపిఎస్ ప్రదీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడనిపై బుధవారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫేస్‌బుక్‌లో తనకు పరిచయం అయిన సదరు మహిళ తనను ఉద్దేశ్యపూర్వకంగా డబ్బులు డిమాండ్ చేసిందని, ఇవ్వకుంటనే అత్యాచారం కేసు పెడుతానని బెదిరించిందని రాజేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల మల్లయ్య తన వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మల్లయ్య కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించడంతో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు కారణమైన ఒకరి రిమాండ్

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు కారణమైన సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కేశవపట్నం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన సుంకరి చందర్ తండ్రి సారయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఒక ఎకరం భూమిని అవసర నిమిత్తం అదే గ్రామానికి చెందిన పేరుమడ్ల రాజబాబుకు అమ్మాడు. రాజబాబు అక్రమంగా ఎకరం భూమికి బదులు మూడెకరాల భూమిని పట్టా చేయించుకున్నాడు. ఈ విషయం చందర్ తండ్రి సారయ్యకు తెలిసి వీరి మధ్య పలుమార్లు పంచాయతీ జరిగింది. అప్పటికి కూడా భూమిని తిరిగి తన తండ్రి సారయ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తన తండ్రి తీవ్ర మనస్తాపం చెంది కేశవపట్నం పొలిమెరలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకన్నాడు. గతంలో సుంకరి చందర్ కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి పేరుమడ్ల రాజబాబును రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదరికంతో బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు

- తిరిగి ఇప్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరికం ఆ తల్లిదండ్రులు బిడ్డను అమ్ముకునేలా చేసింది. తొలుత విక్రయించినా తిరిగి తమ బిడ్డను తమకు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన శ్యామల, రవీందర్ దంపతులు 15 సంవత్సరాలుగా రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. దంపతులకు ఐదుగురు ఆడ పిల్లలు సంతానం. పేదరికంతో పిల్లలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్న పాపను విక్రయించాలని నిర్ణయించుకున్నారు. తమకు పరిచయమున్న జగిత్యాల జిల్లా గోవిందులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మికి తమ పాపను అమ్ముతామని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో మంగళవారం తల్లిదండ్రులు ఇద్దరు లక్ష్మికి పాపను విక్రయించి కాగితం రాసుకున్నారు. బుధవారం శ్యామల తమ పాపను తిరిగి ఇప్పించాలని వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు లక్ష్మిని విచారించగా రూ.90 వేలకు పాపను తనకు విక్రయించారని తెలిపింది. అనంతరం పాపను పోలీసులు శ్యామలకు అప్పగించారు.

సామాజిక వేణుగోపాల్

- ప్రకృతి... జంతువుల ప్రేమికుడు...
- రోడ్డుపై గుంతలు ఏర్పడితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ప్లాస్టిక్ అనర్థాలపై సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం
- హుజూరాబాద్‌లో 'నలుబాల'కు ప్రత్యేక గుర్తింపు

రోడ్డుపై గుంతలు పడ్డాయా.. నలుబాల వేణుగోపాల్ అక్కడికి వస్తాడు. ఎర్ర జెండా ఏర్పాటు చేసి వాహనదారులను దారి మళ్లిస్తాడు.. ఏవైనా జంతువులు చనిపోయాయా.. వేణుగోపాల్ అక్కడికి వచ్చి వాటి కళేబరాలను అక్కడి నుంచి పట్టణానికి దూరంగా తీసుకెళ్లి పూడ్చిపెడతాడు.. ఇలా 25 ఏళ్లుగా హుజూరాబాద్‌లో సామాజిక కార్యక్రమాలకు చిరునామాగా మారారు నలుబాల వేణుగోపాల్. వృతి రీత్యా ఆర్కిటెక్ట్ అయిన వేణుగోపాల్ సామాజిక రుగ్మతలపై యుద్ధం చేస్తున్నాడు. ఆయన వాహనంపై 108 అని రాసుకున్నాడు. ఇలా ఎందుకు అని అడిగితే ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను 108లా అక్కడి వచ్చి సహాయం చేస్తానని చెబుతాడు.

ఆదర్శం



ప్లాస్టిక్ సంచులు వాడవద్దంటూ సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయన ప్రకృతి.. జంతువుల ప్రేమికుడు... రోడ్లపై గుంతలు పడితే సమస్య పరిష్కరించేంత వరకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు అధికారులను పిలిపించి మరమ్మతులు చేయిస్తాడు. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని కూరగాయాల మార్కెట్‌కు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు హుజూరాబాద్‌కు చెందిన నలుబాల వేణుగోపాల్. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆర్కిటెక్ట్ వేణుగోపాల్ వృతిరీత్యా భవనాలకు ప్లానింగ్ చేస్తూ సివిల్ ఇంజినీర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. సామాజిక రుగ్మతలను నిర్మూలిస్తూ ఒక సైన్యంలా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోడ్డు పక్కన కోతులు, కుక్కలు, పందులు చనిపోయి ఉంటే వాటిన తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడం ఆయనకు అలవాటు. కోతులు, కుక్కలతో స్నేహం పెంచుకొని వాటికి ఆహారాన్ని అందిస్తారు. ఎవరైనా అనాథలుగా చనిపోతే వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తాడు. రోడ్లపై గుంతలు పడితే అక్కడ ఎర్ర జెండాతో వాలిపోయి వాహనదారులను దారి మళ్లిస్తాడు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని కూరగాయల మార్కెట్‌కు వెళ్లి బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటాలని సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మొక్కలు నాటుతారు. రోడ్లపై చెత్త ఉంటే స్వచ్ఛభారత్‌లో భాగంగా శుభ్రం చేస్తాడు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేస్తాడు. ప్రభుత్వాధికారుల పనితీరును, సంక్షేమ పథకాలల్లో అవినీతి అక్రమాలను ప్రశ్నించడం ఈయన నైజం. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వేణుగోపాల్ కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పలు అవార్డులు అందుకున్నారు.



హుజూరాబాద్‌లో మొక్కలు నాటుతున్న నలుబాల వేణుగోపాల్

● ఆయన ఒక 108...

వేణుగోపాల్ ద్విచక్ర వాహనానికి 108 అని రాసి ఉంటుంది. ఆయనకు ఎవరైనా ఫోన్ చేసి ఇక్కడ ఒక సమస్య ఉందంటే వెంటనే వాలిపోతారు. షోవోలిన్, కుంగ్‌ఫూ, కరాటేలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ఆయన 25ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో పారిశుధ్యం అమలు కాకుంటే ఎప్పటికప్పుడు అధికారులను అప్ర మత్తం చేస్తుంటాడు. ఆస్పత్రుల్లో పేద రోగులకు ఉచితం గా మందులు పంపిణీ చేస్తూ వారి యోగక్షేమాలను చూసుకుంటారు. చేతనైనంత సాయం చేయడంలో అసలైన తృప్తి ఉందని అందుకే ఇవన్నీ చేసున్నానని, ఎవరేమనుకున్నా తనకు సంబంధం లేదని ఎప్పుడు చెబుతుంటాడు.

● విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు చేయాలనే ఆలోచన



విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. 25 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాను. సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశ్యంతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నాను. ఇక ముందూ చేస్తూ ఉంటాను. నా సంపాదనలో కొంత మేర ప్రజలకు ఉపయోగిస్తాను.

- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్

అదుపు తప్పిన వాహనాలు

- రోడ్డు పక్క, షెడ్, దుకాణాల్లోకి దూసుకుపోయిన కంటైనర్, కారు
- ఆస్తి నష్టం... పోలీసులకు ఫిర్యాదు



షెడ్‌ను ఢీకొట్టిన కంటైనర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23: రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు అదుపుతప్పి పక్కన దుకాణాలు, టీ కొట్టుల్లోకి దూసుకుపోతున్నాయి. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపటం మూలంగానే ఈ ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 12 గంటల వ్యవధిలో కరీంనగర్‌లో రెండు సంఘటనలు చోటుచేసుకోగా అదృష్టవశ్తు ఎవరూ గాయపడనప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివానగర్ వ్యాన్‌ల అడ్డా వద్ద ఒక భారీ కంటైనర్ పద్మనగర్ వైపు నుంచి బైపాస్‌రోడ్



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

గుండా విశాఖపట్నంకు వెళుతూ రోడ్డు పక్కన టీ షాపు షెడ్‌లోకి దూసుకుపోయింది. దీంతో షెడ్ కూలిపోగా, అందులోని ఫర్నిచర్, బైక్, కారు ధ్వంసమయ్యాయి. సుమారు 3.5 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని టీ షాపు యజమాని నర్సయ్య రెండో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కంటైనర్ డ్రైవర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలంలో వీధిదీపాలు లేకపోవటంతో పాటు చీకట్లో డ్రైవర్ మత్తులో ఉండి అతివేగంగా నడపటంతో అదుపుతప్పి షెడ్‌ను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో తిరుమల్‌నగర్‌లో అంబేద్కర్ స్టేడియం చౌరస్తాలో ఒక కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కిరాణంషాపులోకి దూసుకుపోయింది. షాపులోని వస్తువులు కొన్ని ధ్వంసమై నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ఎదురుగా స్కూల్ వ్యాన్ వస్తుండగా తప్పించబోగా అదుపుతప్పి కిరాణం షాపులోకి దూసుకుపోయిందని తెలిపారు. కారును నడుపుతున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

చందుర్తి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ విషయంలో మహిళపై దాడికి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జగట్టు వసంతతో బొజ్జగట్టు మోహన్‌కు ఇంటి పక్కన భూమి విషయంలో గొడవలు జరిగాయి. 16 ఆగస్టు 2014న వసంత ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా మోహన్ గోడ నిర్మిస్తుండగా అడ్డుకున్న వసంతను దూషించడంతోపాటు కొట్టాడు. ఈ మేరకు బాధితురాలు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మోహన్‌కు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రైస్ మిల్లుల కేంద్రంగా మానకొండూర్

● వివిధ రాష్ట్రాల కూలీలకు ఉపాధి



మానకొండూర్‌లో కూలీలకు ఉపాధి కల్పిస్తున్న రైసుమిల్లు

మానకొండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఉమ్మడి జిల్లా వ్యవసాయ ముఖ చిత్రాన్ని మార్చింది. ఎస్సారెస్పీ నీటితో భూములన్నీ సస్యశ్యామలమయ్యాయి. మానకొండూర్ ప్రాంతంలో వరి సాగు పెద్ద ఎత్తున్న పెరిగింది. ఇక్కడి నుంచి రోడ్డు సౌకర్యం ఉండడంతో మానకొండూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రైస్‌మిల్లులు వెలిశాయి. 40ఏళ్ల క్రితం మొట్టమొదటి రైస్ మిల్లును ఇక్కడ ఏర్పాటు చేశారు. మిల్లుల ఏర్పాటుతో స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి లభించింది. క్రమక్రమంగా రైస్ మిల్లుల సంఖ్య పెరగడంతో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం రావడం ప్రారంభమైంది. మానకొండూర్, సదాశివపల్లి గ్రామాల్లో 40కిపైగా రైసుమిల్లులు కొనసాగుతున్నాయి. దాదాపు 1200 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు వరి ధాన్యం సేకరించి ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ అందిస్తూ ఉమ్మడి జిల్లాలో మానకొండూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న రైసు మిల్లులు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. మిల్ ఆపరేటర్లు, మెకానిక్‌లు, లారీ డ్రైవర్లు కూలీలు ఇలా పలు రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. పొట్ట చేతపట్టుకొని వందల కిలోమీటర్ల నుంచి జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో వచ్చిన కూలీలకు మిల్లుల యజమానులు వసతి కల్పిస్తున్నారు. ఒకప్పుడు రైస్ మిల్లులతోనే గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో ఇతర వ్యాపారాలూ ఊపందుకున్నాయి.

న్యూస్ బాక్స్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రీరాములు నియామకం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గోసికొండ శ్రీరాములు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీలో విభాగాధిపతి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. పోస్టుకు ఎంపిక కావడంపై స్థానికులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ఆసక్తి అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అధికారుల దాడులు

గంగాధర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరగ్గాలపై రంగుల వస్త్రాలు తయారు చేస్తున్న లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. చెన్నయ్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, జిల్లా జౌళిశాఖ అధికారులు దాడిలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఓల్లెపు మొగిలి ఇంట్లో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. అక్రమంగా నిలువ ఉంచిన బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్లో మొగిలిపై సివిల్ సప్లై అధికారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రదే శాలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహాయంతో సివిల్ సప్లై అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు ఈ మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23: సిరిసిల్ల పట్టణంలో రగుడు బైపాస్ రహదారిపై బుధవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. మెదక్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుటుంబ సభ్యులతో వేములవాడలో పెళ్లి చూపులకు కోసం బయలుదేరారు. సిరిసిల్ల పట్టణం చంద్రంపేట బైపాస్ తర్వాత రగుడు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ మార్గంలో రహదారిపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రూట్ మార్చుకొని వన్‌వేలో వెళ్తుండగా యూటర్న్ చేసుకొని అతివేగంగా వస్తున్న చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన మరో కారు ఎదుగా ఢీకొంది. దీంతో మహ్మద్ గౌస్ కారు అదుపు తప్పి ఎగిరి కల్వర్టు కిందపడింది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. మరో కారు డి వైడర్‌కు ఢీకొట్టి ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను స్థానికులు కారు నుంచి బయటకు తీసి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ రోజున ఇదే మార్గంలో చంద్రంపేటకు చెందిన వేముల శేఖర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైపాస్ రహదారిపై ధాన్యం ఆరబోయడం, కల్వర్టు నిర్మాణంలో ఉండడం, రోడ్డుపై అక్కడక్కడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. ఎలిగేడు మండలంలోని నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన కరివేద రవీందర్‌రెడ్డి(38) అనే యువకుడు కరీంనగర్ నుంచి రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌రెడ్డి సంఘటన స్థలంలోనే మృతిచెందాడరని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం అనంతరం మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కరీంనగరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడని, ప్రతీ రోజు స్వగ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడని తెలిసింది.

ఎన్టీపీసీలో ఒకరి దుర్మరణం

జ్యోతినగర్, అక్టోబరు 23: ఎన్టీపీసీ బీ టైపు గేటు సమీప రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ ఖలీం(38) అనే దివ్యాంగుడు మృతిచెందాడు. గోదావరిఖని నుంచి తన స్కూటీపై రామగుండం వైపు వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపై ఆపడంతో వెనుకనే వస్తున్న ఖలీం వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా చనిపోయాడు. ఖలీం స్వగ్రామం పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. గోదావరిఖనిలోని మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని హన్మంతునిపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వేములవాడ మండలం అనుపురంలోని ప్రధాన రహదారిని ఆనుకొని చెట్ల పొదల్లో సుమారు 50 సంవత్సరాల వయస్సుగల పురుషుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసినకరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశం, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ మణిదీప్తి, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, చిలుక సతీష్, జానీ, చిన్నయ్య, గుజ్జేటి వెంకన్న, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానేరు వంతెన రెండు జిల్లాలకు వరం లాంటిది

ఓదెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపునారాయణపేట మానేరువాగుపై వంతెన సౌకర్యం పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రూపునారాయణపేట సమీపంలోని మానేరు వాగుపై మంజూరైన వంతెన నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, జేఈలతో కలిసి సందర్శించారు. ఓదెల మండలం రూపునారాయణపేట, మానేరు వాగు నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మీదుగా నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించి అంచనా వ్యయాన్ని సమీక్షించారు. గ్రామాల్లో వెడల్పు, వంతెన పొడవులపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణమైతే రైతులకు జమ్మికుంటలోని మార్కెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రూ. 80 కోట్లు కేటాయించగా, అదనంగా ఎన్ని కోట్ల నిధులైనా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతకుముందు గుంపుల నుంచి జమ్మికుంట వైపు వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసం కావడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, అంకం రమేష్, బోడకుంట స్వామి, బొంగోని శ్రీనివాస్, ఆకుల మహేందర్, పడాల రాజు, సిరిసేటి రాహుల్, రెడ్డి రజనీకాంత్, కోట నిరంజన్ రెడ్డి, నీర్ల శ్రీనివాస్, చింతం కుమారస్వామి, నాగపూరి రవి గౌడ్, చీకట్ల ముండయ్య, సంద మహేందర్, తిప్పారపు సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 150 మంది విద్యార్థులు



బస్సులో విద్యార్థులు

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో వందలాదిగా ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్నారు. ఈ స్కూల్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తుంటారు. అయితే వీరందరి కోసం జగిత్యాల డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఒక్కో ట్రిప్ ద్వారా విద్యార్థులను స్కూల్‌కు చేరవేస్తుంటాయి. అయితే బస్సులో 60 మంది లోపే ప్రయాణించే అవకాశం ఉండగా నిత్యం 150 మందికి పైగా విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. బుధవారం బస్ పాస్ లేని వారే 140 మంది ఉన్నట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు బస్సులను రెండు ట్రిప్పుల చొప్పున నడుపాలని కోరుతున్నారు

నయా ట్రెండ్..



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో స్విమ్మింగ్‌పూల్ లోపలి భాగం

"ప్రస్తుతం ఫంక్షన్ల నిర్వహణలో కొత్త ట్రెండ్ నడుస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఫాంహౌస్ కల్చర్ నడుస్తోంది. గెట్‌టు గెదర్‌లు మొదలుకొని హల్దీ, సంగీత్ ఇలా రకరకాల ఫంక్షన్లను ఫాంహౌస్‌ల్లో నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. ఈ ఫాంహౌలక్ష రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ కిచెన్, నైట్ ఫైర్, ఫొటో షూట్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంది. నిర్వాహకులు అందుబాటు ధరల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఫాంహౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు."

- ఫాంహౌస్‌ల్లో ఫంక్షన్లు
- కరీంనగర్‌లో పదుల సంఖ్యలో ఏర్పాటు
- స్విమ్మింగ్‌పూల్‌లు, రెయిన్ డ్యాన్స్‌లతో అధునాతన సౌకర్యాలు

భగత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫాంహౌస్ కల్చర్ రోజురోజుకు పెరిగిపోతోంది. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. తమ ఫంక్షన్లను ఫాంహౌస్‌లలో నిర్వహించుకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, రేకుర్తి, చింతకుంట, కమాన్‌పూర్‌తోపాటు కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు సమీపంలో ఫాంహౌస్‌లు నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం, ఆత్మీయుల మధ్య పార్టీలను ఫాంహౌస్‌లలో చేసుకోవాడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.



ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, ఈఫిల్ టవర్ నమూనా

అన్ని రకాల ఈవెంట్స్‌కు అనుకూలం

ఫాంహౌస్‌ల్లో అన్నిరకాల ఈవెంట్స్ చేసుకోవడానికి వసతులు కల్పిస్తున్నారు. పెళ్లికి ముందు సంగీత్, హల్దీ వేడుకలు, బ్రైడ్‌గ్రూమ్ సెర్మన్, డెస్టినేషన్ వెడ్డింగ్, రిసెప్షన్ పార్టీలు, ఫ్యామిలీ ఔటింగ్‌లు, గెట్ టు గెదర్‌లు, బర్త్ డే పార్టీలు, రిటైర్‌మెంట్ ఫంక్షన్స్, బ్యాచ్‌లర్ పార్టీస్, సర్‌ప్రైస్ పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్స్, కిట్టీ పార్టీలు, ఫొటో షూట్‌లు మొదలుకొని ఆత్మీయ సమ్మేళనాలు ఇలా ఏ సెలబ్రేషన్స్ అయినా ఫాంహౌస్‌లలో నిర్వహించుకోవచ్చు.

అత్యాధునిక వసతులు

ఫాంహౌస్‌ల్లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ఏసీ రూంలు, వైఫై సదుపాయం, వాష్ రూంల్లో గీజర్ ఏర్పాటు చేస్తున్నారు. సూట్ రూంలు అందుబాటులో ఉంటున్నాయి. ఆహ్లాదకరమైన గార్డెనింగ్, పెళ్లికి కావాల్సిన సంప్రదాయ వస్తువులు, సంగీత్ కార్యక్రమానికి అవసరమైన వసతులతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిల్లో వాడే వస్తువులు, ఎడ్లబండ్లు, చేద బావితో పాటు అన్ని వస్తువులను ఫాంహౌస్‌లలో సమకూరుస్తున్నారు. రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, కిచన్‌తోపాటు, ప్రైవేట్ కిచెన్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్యామిలీలు ఉండడానికి వసతి సదుపాయం, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్, నైట్‌ఫైర్, ప్రొజెక్టర్, ఫొటో షూట్ కోసం అనువైన వాతావరణాన్ని సమకూరుస్తున్నారు. అన్ని ఫాంహౌస్‌లలో వాహనాలు పార్కింగ్ చేయడానికి ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో ధరలు

ఫాంహౌస్‌లలో చిన్న కార్యక్రమాలతోపాటు పెద్ద పార్టీలు నిర్వహించడానికి ధరలు అందుబాటులో ఉండడంతో ఈవెంట్స్ చేసుకోవడానికి నగరవాసులు ఇష్టపడుతున్నారు. ఫాంహౌస్‌లో ఉన్న వసతులను బట్టి ఎనిమిది వేల రూపాయల నుంచి ఇరవైవేల రూపాయల వరకు ధరలు నిర్ణయించారు. పది మంది సభ్యుల నుంచి మొదలుకుని వందల సంఖ్యలో కార్య క్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫాంహౌస్‌ల్లో వసతులు కల్పించారు. కొన్ని ఫాంహౌస్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా బ్యాక్‌అప్ సదుపాయం కూడా కల్పించారు.



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన ఊయల

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..



అన్ని ఫంక్షన్లకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తు న్నాం. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటు ధరలోనే ఫాం హౌస్ లభిస్తుండడంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

- శ్రవణ్, ఆర్‌కే రిసార్ట్స్ యజమాని





ఫాంహౌస్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఈవెంట్లు

4 నుంచి ఎంఎడ్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నవంబరు4 నుంచి, రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ www satavahana.ac.inలో సందర్శించాలని సూచించారు.

● ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా శాతవాహన యూనివర్సిటీ చేపట్టబోయే రెండో కాన్వకేషన్‌కు ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను కోరగా ఆయన సానుకులంగా స్పందించారని వీసీ ఉమేశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని గవర్నర్ సూచించారన్నారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని 12 మందిని మోసం చేసిన కముటం మౌనిక, కందుకూరి శ్రీధర్‌చారిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన మౌనిక భర్తతో విడిపోయి కరీంనగర్‌లో ఉంటోంది. ఇదే సమయంలో శ్రీధర్‌చారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి మౌనిక తల్లిగారి గ్రామమైన పెద్దలింగాపూర్‌కు చేరుకొని శ్రీధర్‌ను బ్యాంకు అధికారిగా పరిచయం చేసింది. కేంద్రప్రభుత్వ పథకం ముద్ర యోజన కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మబలికింది. పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, లక్ష్మీపూర్, కొడిముంజ గ్రామాలకు చెందిన 12 మంది దగ్గర నుంచి రూ 3.45లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి శంకర్ ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పాలకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామ శివారులో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. కేశోరాం సిమెంటు కర్మాగారంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సందవెన గట్టయ్య (54) బసంత్‌నగర్ నుంచి తన స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు వెళుతుండగా మార్గమధ్యంలోని జయ్యారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఐఈవో



-క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. మధుజూన్సన్, ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, అడిషనల్ ఎస్పీ, రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్ అచ్చేశ్వర్‌రావు, టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, సరిత, సుజాత, శివ, అనూప్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో మగ బిడ్డకు జన్మనిచ్చిన ప్రయాణికురాలు



ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

అంతర్గాం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎక్స్‌ప్రెస్(ఢిల్లీ-సికింద్రాబాద్)లో ఆగ్రా నుంచి కరీంనగర్ వెళ్తున్న సోమ స్వాతి బుధవారం రైలులోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. రైలు మందమర్రి వరకు రాగానే స్వాతికి పురిటి నొప్పులు రావడంతో స్పందించిన రైల్వే టీసీ 108 సిబ్బందికి సమాచారం అందించారు. రైలు రామగుండం చేరేలోగా 108 సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే స్వాతి ప్రసవం కావడంతో 108సిబ్బంది గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సీసీఐ బోణీ

- మొదటి రోజు 11.70క్వింటాళ్లు కొనుగోలు
- మద్దతు ధర రూ.7,270గా నిర్ణయించిన అధికారులు



మార్కెట్ యార్డులో పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) బుధవారం బోణి కొట్టింది. వరంగల్ జేడీఎమ్ వి శ్రీనివాస్, డిడిఎమ్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆర్డీవో రమేష్‌బాబు, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్లా రవీందర్‌రెడ్డి 11.70క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చాడు. సీసీఐ అధికారులు పరిశీలించగా 19శాతం తేమ వచ్చింది. తేమ ఎక్కువగా ఉన్నప్పటికి నాణ్యత బాగుండటంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల వినతి మేరకు సీసీఐ రూ.7270.37మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. కాని సదరు రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో అతడి సమీప బంధువు అయిన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వంగల వెంకట్‌రెడ్డి పేరిటా విక్రయించాడు. ఈ సందర్భంగా డిడిఎమ్ పద్మావతి మాట్లాడుతూ నాణ్యమైన పత్తి విక్రయానికి తీసుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 పొందాలని రైతులకు సూచించారు. 8నుండి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకోని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారి పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ ప్రతులను వెంట తీసుకు రావాలన్నారు. దళారులు, మధ్యవర్తులను నమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ద్వితీయశ్రేణి కార్యదర్శి ఎస్ రాజా, అడ్తీదారులు రైతులు పాల్గొన్నారు.

ఒగ్గు కళ నుంచి సినీ రంగం వైపు..

- వరుస అవకాశాలతో రాణిస్తున్న మల్లేశం
- బ్రహ్మచారి సినిమాతో హీరోగా గుర్తింపు



మహిళ వేషధారణలో మల్లేశం

"కళారంగంపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని టాలీవుడ్ వైపు తీసుకెళ్లింది.. మొదట ఒగ్గు కళాకారుడిగా ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను కట్టిపడేసేవాడు. ఎక్కడ ప్రదర్శన ఇచ్చిన వందల సంఖ్యలో గుమిగూడేవారు. ఒగ్గుకథకుడిగా ప్రత్యేక గుర్తింపు రావడం, నటనపై ఉన్న ఇష్టంతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. వివిధ షార్ట్ ఫిలింలు రూపొందించి అప్‌లోడ్ చేశాడు. అవి సినీ పెద్దల దృష్టిలో పడడంతో సినీ రంగంలో అవకాశాలు వచ్చాయి. వివిధ ప్రాతలు పోషిస్తూ మంచి నటుడిగా గుర్తింపు పొందాడు."



షార్ట్ ఫిలింలో గొర్రెల కాపరి గెటప్‌లో గుంట మల్లేశం



హీరో సుమన్‌తో గుంట మల్లేశం



బ్రహ్మచారి సినిమా పోస్టర్‌లో గుంట మల్లేశం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గుంట మల్లేశంకు చిన్న తనం నుంచి కళారంగం అంటే ఇష్టం. కులవృత్తిలో భాగం గా తన తండ్రి ఒగ్గు కథలు చెబుతుండడం గమనించేవాడు. తండ్రి వద్ద ఒగ్గు కథలు చెప్పడం నేర్చు కున్నాడు. భావయుక్తంగా కథలు అల్లుతూ ప్రేక్షకు లను కట్టిపడేసేవాడు. ఒగ్గు కథల్లో ఆడ వేశధారణ మల్లేశంకు కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఇలా ఒగ్గుకథలతో రాణిస్తున్న మల్లేశంకు షార్ట్ ఫిలింస్ తీయాలనే ఆలోచన వచ్చింది. జీఎం ఫోక్స్ పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. చిన్న చిన్న కథలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ప్రేక్షకుల మంచి ఆదరణ లభించింది. దీంతో 500కు పైగా షార్ట్ ఫిలింస్, 100కు పైగా ఫోక్ సాం గ్స్ చేశాడు. యూట్యూబ్ ద్వారా మల్లేశంకు సినిమా ల్లో అవకాశం లంభించింది. మందుగా 'సైన్యం' సినిమాలో రాజకీయ నాయకుడి కార్యకర్తగా సైడ్ క్యారె క్టర్‌గా చేశాడు. వరుసగా 'సైదులు, బద్మాష్' సిని మాల్లో పలు పాత్రల్లో నటించాడు. అనంతరం 'బ్రహ్మచారి' అనే కామెడీ సినిమాలో హీరోగా అవకాశం లభించింది.

బ్రహ్మచారి సినిమాకు అవార్డు

బ్రహ్మచారి సినిమాను తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నంది అవార్డుకు ఎంపిక చేశారు. బ్రహ్మచారి సినిమాకు మొదటి షోతోనే మంచి పబ్లిక్ టాక్ వచ్చింది. దీంతో వరసగా మల్లే శంకు అవకాశాలు వస్తున్నాయి. 'రాజుగాడు రాజైతే, శివశంభో' సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నా డు. త్వరలో తీయబోయే 'బ్రహ్మచారి-2' సినిమాలో నటించనున్నాడు.

రోడ్లు, వంతెన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం మంజూరి చేసిన నిధులతో చెపట్టిన రోడ్లు వంతెన నిర్మాణ పనులను వేగవతంగా పూర్తి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంచాయితీ రాజు అధికారులకు సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. మండాలలో వివిధ గ్రామాలకు కలిపే లింక్ రోడ్డు నిర్మాణం మరమ్మతులకు అంచనాలు వేసి ప్రణాళిక రూపొదించాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎంపీడీఓలు రామకృష్ణ, చంద్రశేఖర్, జగదీష్, మెట్‌పల్లి డీఈ రాంరెడ్డి, కోరుట్ల డీఈ సత్యనారాయణ, పంచాయతీ రాజ్ అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి


తాటిపల్లిలో భూసేకరణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి-63 నిర్మాణం కోసం చేస్తున్న భూసేకరణ పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పనులను సకాలంలో పూర్తిచేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా సర్వే చేపట్టాలన్నారు. ఈసందర్భంగా జాతీయరహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, బోర్లు, పైపులైన్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించి వాటికి చెల్లించాల్సిన నష్టపరిహారం అంచనా విలువలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కలిసిపూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో భూములు కోల్పోతున్నవారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అనుసరించాల్సిన విధానాలను వివరించారు.

● కోరుట్ల : ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించి, ఎల్ఆర్ఎస్ అనదికార లే అవుట్ల కమబద్ధీకరణ సక్రంగా జరుపాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బిలాల్ పుర ప్రాతంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ అధికారుల పనితీరును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మెట్‌పల్లి ఆర్‌డీఓ, కోరుట్ల ఇంచార్జ్ ఆర్‌డీఓ నక్క శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. పలు భూముల రికార్డులను పరిశీలించి వాటి వివరాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించి వాటిలోని లొసుగులు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, కమిషనర్ తిరుపతిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కోరుట్ల రూరల్ : జాతీయ రోడ్డు 63 నిర్మాణం కొరకు నిర్వహిస్తున్న భూ సేకరణ సక్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ జాతీయ రోడ్డు సర్వే బృందంకు సూచించారు. బుధవారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామ శివారులో జాతీయ రోడ్డు నిర్మాణం కొరకు నిర్వహిస్తున్న స్థల సేకరణ సర్వేను పరిశీలించి అధికారులు పలు సూచనలు సలహాలను అందించారు. ఎలాంటి లోపాలు లేకుండా భూ సర్వే నిర్వహించి సేకరించాలని సూచించారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో

ధర్మపురి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ విద్యా జిల్లా అధికారి (డీఐఈవో) డాక్టర్ వేంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇంటర్ విద్యా పరిపాలనలో భాగంగా ఆయన జూనియర్ కళాశాలను సందర్శించి, అన్ని బోధనా తరగతులను పరిశీలించారు. విద్యార్థులను బోధనా, అభ్యాసన, సమస్యలు గురించి అడిగి తెలుసుకుని ఉపన్యాసకులకు తగు సూచనలు అందించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు కృషి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి బీఎస్‌రావు

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బీఎస్‌రావు అన్నారు. ఆయన స్వగ్రామం మండలంలోని నూకపల్లిలో బుధవారం పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నాని తనను గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలో నాలుగు లక్షల ఉద్యోగ అవకాశాలు అందించడానికి పాటు పడుతానని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పనకు పాటుపడుతానని అన్నారు. యువత ఓటు నమోదు చేసుకొని వినియోగించు కోవాలని అప్పుడే ప్రశ్నించే తత్వం అలవర్చుతుందని అన్నారు.

మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

రాయికల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీ కరణ అమలు చేయడం లో నిర్లక్ష్యం చేస్తున్నం దుకు నిరసనగా జగిత్యా ల జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించ నున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయా లని ఎమ్మెస్పీ జిల్లా అధి కార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ కోరారు. రాయికల్ పట్టణ కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్ ఆధ్వ ర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగ ని పోరాటం జరుగుతుందన్నారు. ఎస్సీలు ఉన్న టువంటి 59 కులాలకు విద్య, ఉద్యోగ, సాంఘీక, సంక్షేమ రంగాల్లో వర్గీకరణ లేకపోవడం వల్ల 75 ఏళ్లుగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నామన్నారు. ఈ మహాసభకు మందకృష్ణ మాదిగ రానుండటంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నక్క సతీష్ మాదిగ, కో కన్వీనర్ పోడేటి సునీల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బాపురపు నర్సయ్య, పాలెపు బాలరాజు, పాలెపు సురేష్, మసీదు అజయ్, పాలెపు గణేష్, సుమంత్, నేరెళ్ల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత గురుకులాల ఏర్పాటులో మార్పులు చేయాలి

రాయికల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమీకృత గురుకులాల్లో అన్ని వర్గాలు, మతాల విద్యార్థులందరూ ఒకే పాఠశాలలో విద్యను అభ్యసించే విధంగా మార్పులు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేష్ అన్నారు. రాయికల్ మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్, ఆలూరు, రాయికల్ ప్రభుత్వ పాఠశాలలను టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలను సేకరించడంతో పాటు సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 15 శాతం కేటాయించాలని, తద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాంచంద్రం, టీపీటీఎఫ్ నాయకులు వేముల సుధాకర్, ఎనగందుల శ్రీధర్ పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా విద్యా, వైద్య హబ్‌గా మారింది

డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 23: జగిత్యాల జిల్లా విద్యా, వైద్య హబ్‌గా మారిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ.5కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టనున్న అదనపు తరగతుల నిర్మాణానికి ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో రూ.1.80లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.3కోట్ల 92లక్షలతో రెండస్తులతో అదనపు తరగతి గదులు, ఆధునిక టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. బీర్‌పూర్ మండలంలో కస్తూర్బా గాంధీ కళాశాల, జగిత్యాలలో ఎస్సీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు వృత్తివిద్య కోర్సుల పట్ల ఆలోచన చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎసకేఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, ఈఈ ఎడ్యుకేషన్ అనితసింగ్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ గిరి నాగభూషణం, రోటరీ క్లబ్ సభ్యు లు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్నాల కొనుగోళ్లు ప్రశ్నార్థకం

(5 పేజీ తరువాయి..)

రైస్‌మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్ రవణా చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని రా రైస్, పారాబాయిల్డ్ రైస్ మిల్లుల సంక్షేమ సంఘం జిల్లాల కమిటీలు స్పష్టం చేశాయి.

ఇదే విషయాన్ని తమ రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం సేకరణ ఎలా సాధ్యమనే సంశయాలు వ్యక్తమవుతున్నాయి.

సన్నరకాలపై మిల్లర్ల పేచీ

సీఎంఆర్ దొడ్డు రకాలపై వచ్చే తరహాలో 67 శాతం ఔట్ టర్న్ రాదని సన్నరకంపై రైస్‌మిల్లర్లు పేచి పెడుతున్నారు. సన్న రకం ధాన్యం ఔట్‌టర్న్ 58 శాతం మాత్రమే వస్తుందని, ఆమేరకు తగ్గించాలని, లేకుంటే క్వింటా ధాన్యానికి రూ. 300 పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి రైస్ మిల్లర్ల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ధాన్యం నిల్వల తరుగుదలపై ఒక శాతం డ్రైయేజ్ చార్జీలతో పాటు, రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వచేసినందుకు ప్రతినెలా క్వింటా ధాన్యానికి రూ. 2.40 చొప్పున ప్రతి సీజన్‌కు రెండుసార్లు కస్టోడియన్ చార్జీలతోపాటు పలు డిమాండ్లు తెర మీదకు తెస్తున్నారు.

బియ్యం రవాణా, బ్లెండింగ్ చార్జీలతో పాటు గత ఆరేళ్లుగా బకాయి ఉన్న సీఎంఆర్ చార్జీలు చెల్లించాలని కోరుతు న్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పౌరసరఫరాల అధికారులు వానాకాలం ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తరలింపు సజావుగా సాగేందుకు రైస్‌మిల్లర్ల సంఘాలతో సంప్రదింపులు చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలి

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో చురుగ్గా చేపట్టాలని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మల్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి బూత్ అధ్యక్షులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాడి బాల్‌రెడ్డి, గాజుల మల్లేశం, సంగని రవి, పరమేశ్, కొక్కెర మల్లేశం యాదవ్, అనిల్, గంగరాజం, రాజశేఖర్ పాల్గొన్నారు.

ధర్మపురి మండలంలో..

ధర్మపురి : బీజేపీ సభ్యత్వ నమోదు పట్ల కార్యకర్తలు శ్రద్ధ వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని శ్రీ కర్ని అక్కపెల్లి కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క బీజేపీ నాయకులు, కార్యకర్త వంద 100 మందిని సభ్యత్వ నమోదు చేయించాలని అన్నారు. ఈ నెల 29 వరకు సభ్యత్వ నమోదు పూర్తి చేయించాలని ఆయన సూచించారు. సమావేశంలో బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇంఛార్జ్ కన్నం అంజయ్య, కన్వీనర్ కొమ్ము రాంబాబు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మరిపెల్లి సత్యం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూయ, బీజేపీ మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, ఆకుల శ్రీనివాస్, నలుమాసు వైకుంఠం, తిరుమన్‌దాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు పంపిణీ

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన మార్గం భూదేవికి 1,50,000 రూపాయల విలువ గల ఎల్‌వోసీ చెక్కును, ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన బి. సాయికుమార్‌కు 2 లక్షల విలువ గల చెక్కు మంజూరు కాగా ఎమ్మెల్యే బుధవారం వారికి అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి డీఏను వెంటనే చెల్లించాలని టీఎస్‌యుటీఎస్ జిల్లా అధ్యక్షుడు తీరుకోవెల శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వం పాఠశాలలో భోజన విరామ సమయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌తో కలిసి ఉపాధ్యాయులకు టీఎస్‌యుటీఎఫ్ యూనియన్ సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ కొండ్ర అనిల్, మండల అధ్యక్ష ప్రదాన కార్యదర్శులు వెలుమల రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కొడిమ్యాల, అక్టోబరు 23:(ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వారి పశువులకు వేయించుకోవాలని జిల్లా పశు ఉప వైద్యాధికారి బోనగిరి నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని సూరంపేట గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

అక్రమ నిర్మాణం నిలిపివేయాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులో స్వయం భూ ఆలయం వద్ద అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని నిలిపి వేయాలని కోరుతూ బుధవారం పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ టి. మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చట్టం ప్రకారం వేసిన రోడ్లను ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారని వెంటనే అపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, నాయకులు నాగేష్, విజయ్, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు రూ. 10,92,500 చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందించారు.

● కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు గడ్డం చిన్నారెడ్డి, గడ్డం స్వామిరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్, ముదాం శేఖర్, ఏనుగు సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జువ్వాడి నర్సింగరావు


వేంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వేంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను ఛైర్మన్ కామిరెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి విశాల సహకార సంఘం వైస్‌ఛైర్మన్ సురకంటి సంజీవ్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసా ఇప్పించండి

కొడిమ్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా ఇవ్వాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల బీజేపీ నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి నర్సింహరెడ్డి, సాయిబాబా ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో చేప పిల్లల విడుదల ఆలస్యం


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసమర్థ పాలనకు చేపపిల్లల విడుదలే నిదర్శనమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. జూన్ నెలలో విడుదల చేయాల్సిన చేప పిల్లలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అక్టోబర్‌లో విడుదల చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ అసమర్థ పాలనకు ఇది నిదర్శనమని అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకట్రావ్‌పేట గ్రామ శివారులోని పెద్ద చెరువులో తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లాలను మత్స్యకార్మికులతో కలిసి చెరువులో విడుదల చేశారు. మరో 60 వేల పిల్లలు ఇవ్వాలని మత్స్య కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, మత్స్యశాఖ అధికారి విజయ ఉన్నారు.

కుళాయి ఇలా.. నీరు పట్టేదెలా..?


మురికి కాలువలో ఉన్న కుళాయి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్‌లో వద్ద గల తాగునీటి కుళాయి మురికి కాలు వలోనే ఉంది. ప్రయాణికుల సౌక ర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి నుంచి వచ్చిన నీటితో అక్కడ గుంత ఏర్పడిం ది. ప్రయాణికులు అక్కడే నీరు పట్టుకుం టుండగా అదే ప్రాంతంలో వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల వారు డ్రైనేజీ వద్దనే వంట పాత్రలు కడుగుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కులాయి వద్ద పారిశుధ్యం పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం జిల్లా చైర్మన్‌గా గంగ మల్లేశం


గంగ మల్లేశం

పెగడపల్లి, అక్టోబరు 23 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం జగిత్యాల జిల్లా చైర్మన్‌గా పెగడపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశంను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. కమిటీ సభ్యులు సన్మార్గంలో నడిచే విదంగా పని చేయాలని పేర్కొంటూ నియామకం చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగ మల్లేశం మాట్లాడుతూ సంఘాన్ని క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తన నియా మకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి

కోరుట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు కొట్టుకు పోయిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, వంతెన నిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి మానుక ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రంను అందించారు. ఈ సందర్భంగా మానుక ప్రవీణ్ మాట్లాడారు. కోరుట్ల మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని వాగుపై భారీ వంతెనను నిర్మాణం చేసి ప్రయాణికుల ఇబ్బందు తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో మహాదేవ్, విజయ్, కటకం మహాదేవ్, బాలే మారుతి, గుంటుక మహేష్, గాజెల్లి రాజ గణేష్, నదీం, మనోజ్, అనిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న డాక్టర్‌కు సన్మానం

ధర్మపురి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల వెటర్నరీ డాక్టర్ బద్దం రాజేందర్‌రెడ్డి బదిలీపై వెళుతున్న సందర్భంగా బుధవారం పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. గత 12 ఏళ్ల పాటు విధి నిర్వహణలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, ఏఎంసీ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, సిలివేరి సత్యనారాయణ, కుంటాల శంకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు'

కొడిమ్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దళిత ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యంను ప్రతిపక్ష పార్టీల నాయకులు మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలను విడుతల వారీగా అమలు చేస్తుందన్నారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి కనీసం నిధులు కూడా బీజేపీ నాయకులు మంజూరు చేయించలేదని విమర్శించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ గౌడ్, నాగభూషణ్‌రెడ్డి, ప్రసాద్, స్వామి, లక్ష్మీరాజం, చంద్రమోహన్‌రెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 23: జగిత్యాల మండలం పొలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు, వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 21 సంవత్సరాల తర్వాత ఒకే చోట చేరిన వారందరూ గతకాలపు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమలో ఒకడైన తమ స్నేహితుడు గత సంవత్సరం మరణించగా అతని కుటుంబసభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

యువకుడి రక్తదానం

భీమారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన పుష్ప అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా విషయం తెలుసుకున్న బక్కూరి ఫౌండేషన్ ఛైర్మన్ బక్కూరి నరేష్ స్వయంగా వెళ్లి రక్తదానం చేశాడు.

జాబితాపూర్ హత్య కేసుపై పోలీసుల విచారణ

● హత్యకు పాల్పడ్డ నిందితుడి సెల్‌ఫోన్ కాల్ డాటా సేకరణ ● కొనసాగుతున్న పోలీసుల పికెటింగ్

జగిత్యాల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి(58) హత్య కేసుపై జగిత్యాల పోలీసులు ప్రత్యేక నజర్ పెట్టారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో కేసు విచారణను వేగంగా కొనసాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం వేకువజాము నుంచే వాహనాల తనిఖీతో పాటు అనుమానిత ప్రదేశాల్లో పోలీసులు సోదాలు సైతం నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ హత్య కేసుపై బుధవారం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సైతం నిర్వహించి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

మూడు ప్రత్యేక టీంల ఏర్పాటు

జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, నాలుగు దశాబ్దాలుగా జీవన్‌రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా గంగారెడ్డి పేరుపొందారు. మంగళవారం ఉదయం గ్రామ కూడలిలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు మూడు టీమ్‌లుగా ఏర్పాడ్డారు. జగిత్యాలతో పాటు వివిధ ప్రాంతాల్లో హత్యకు పాల్పడ్డ నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు మాత్రం నిందితుడు పరారీలో ఉన్నాడని చెబుతుండగా మృతుని కుటుంబ సభ్యులు పోలీసుల అదుపులోనే నిందితుడు ఉన్నారని ఆరోపిస్తున్నారు. మృతుని కూతుర్లు సైతం మీడియాతో మాట్లాడుతూ హత్యకు పాల్పడ్డ నిందితుడితో పాటు వెనుక ఉన్న వ్యక్తులను పోలీసులు తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనుమానితుల విచారణ

హత్యకు పాల్పడ్డ నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్ సెల్ ఫోన్‌ను సంఘటన స్థలంలో పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాల్ డాటా వివరాలను బుధవారం పూర్తిగా సేకరించారు. నిందితుడు సంతోష్ గౌడ్ హత్యకు పాల్పడక ముందు ఎవరెవరికి ఫోన్‌లో మాట్లాడాడు అనే అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. బుధవారం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఓ ఐదుగురు వ్యక్తులను సంతోష్ గౌడ్ కాల్ డాటా ఆధారంగా అదుపులోకి తీసుకుని హత్యకేసు విషయంలో విచారణ చేపట్టి పూర్తి వివరాలు సేకరిరించినట్లు తెలిసింది. అంతే కాకుండా పలు అనుమానిత వ్యక్తులను సైతం రూరల్ ఠాణాకు పిలిపించుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.

కొనసాగుతున్న బందోబస్తు

జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హత్య అనంతరం గ్రామంలో బయానక వాతావరణాన్ని తొలగించేలా పోలీసులు బందోబస్తు రెండవ రోజు కొనసాగించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. హత్యకు పాల్పడిన అనంతరం నిందితుడు ఎలా తప్పించుక పోయాడు, ఎవరైనా తప్పించారా అనే కోణంలో కేసు దర్యాప్తు చేశారు. హత్య కేసులో నిందితుడి పట్టివేతపై డీఎస్పీ రఘుచందర్‌ను వివరణ కోరగా నిందితుడి పట్టుకునేందుకు మూడు పోలీసు టీంలు గాలిస్తున్నాయన్నారు.